# వెండితెరపై పిండి వెన్నెల చిత్రాలు



బాపు

వెండితెరపై మెరిసే వెన్నెల సంతకం బాపు. చిత్ర కళా వైజయంతిలో వెలుగుల తిలకం బాపు. కమర్షియల్ చిత్రాల చీకట్లు ముసిరిన వేళ 'గోరంత దీపాలు' వెలిగించి, తెలుగు సినిమా ముంగిట 'ముత్యాల ముగ్గు'లు వేసిన ఉత్తమాభిరుచికి మరో పేరు బాపు. సాక్షి, సీతాకల్యాణం, భక్తకన్నప్ప, సంపూర్ణ రామాయణం వంటి అద్భుత కళాత్మక చిత్రాల అపురూప శిల్పి.

బాపు అసలు పేరు సత్తిరాజు లక్ష్మీనారాయణ. 1933 డిసెంబర్ 15న పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురంలో జన్మించారు. ఎవరి దగ్గరా శిష్యరికం నెరపకుండానే ఆయన చిత్రకారుడయ్యారు. పదహారేళ్ళ లేత వయసులోనే ఆయన బొమ్మలకు ప్రాణం పోయడం ఆరంభించారు. మద్రాసు యూనివర్శిటీలో న్యాయశాస్త్రంలో పట్టా పుచ్చుకొన్న బాపు ఆ తరువాత పెద్ద అడ్వర్టైజింగ్ ఏజెన్సీలో కమర్షియల్ ఆర్టిస్టుగా ఉద్యోగంలో చేరారు. వ్యాపార సంస్కృతికి అనుగుణమైన తళుకులన్నీ అక్కడ పూర్తిగా వంటబట్టించుకొన్నారు. మరో చేత్తో ఆంధ్రప్రభకు రాజకీయ కార్టూన్లు గీస్తూ, వ్యంగ్యోక్తులు, చెణుకులు చమక్కులు అలవరుచుకొన్నారు. పత్రికల్లో కథలకు బొమ్మలు గీసే వారు. బాపు తమ కథలకు బొమ్మలు గీస్తే, అవి భాగ్యరేఖలుగా చాలామంది రచయితలు ఎంతో అబ్బురంగా చెప్పుకొంటారు. ఎన్నో బొమ్మలు, ఎన్నెన్నో కార్టూన్లూ, మరెన్నో ముఖ చిత్రాలు. చిత్రకళాజగతిలో బాపూ జైత్రయాత్ర ఆరంభమైంది. ఆంధ్రదేశం ఆయన కళా హృదయానికి దాసోహమంది.

ఆంధ్ర వారపత్రికలో సినిమా ప్రతినిధిగా పనిచేస్తున్న రచయిత ముళ్ళపూడి వెంకటరమణతో బాపూకు స్నేహం కలిసింది. ఇద్దరూ కలిసి సినిమాలు చూస్తూ, సమీక్షిస్తూ 'మనమైతే ఎలా తీస్తామంటూ' కలలు కంటూ కాలక్షేపం చేసేవారు. సినిమా తీయాలనే నిర్ణయాన్ని ఓ అందమైన సాయంత్రం వారిద్దరూ తీసుకొన్నారు. కదలని బొమ్మలతో బాపు, కదిలే బొమ్మలతో రమణ అప్పటికే ఎంతో లబ్ధప్రతిష్టులు. పలుకుబడే పెట్టుబడిగా పెట్టి సినిమా తీశారు. అదే 'సాక్షి'. గుడిగంటలు, మూగ మనసులు, దాగుడుమూతలు వంటి చిత్రాలకు స్క్రిప్ట్ అందించిన రమణగానీ, బాపూగానీ ఎవరి దగ్గరా శిష్యరికం అంటూ చేయలేదు. అందుకేనేమో వారి పనితనంలో అంతటి స్వచ్ఛత. దాదాపు కొత్త ముఖాలతో 'సాక్షి' సినిమా తీసారు. కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. మేకప్ లేకుండా, గ్లామర్‌ను పట్టించుకోకుండా సహజమైన పల్లెటూరిలా చిత్రీకరించిన ఈ చిత్రం చలనచిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించింది. చాలమంది నటులకు 'సాక్షి' చిరునామా అయింది. తరువాత వచ్చిన 'బంగారుపిచుక' 'బుద్ధిమంతుడు' చిత్రాలతో బాపు తన సత్తా పూర్తిగా నిరూపించుకొన్నారు. తన రేఖా చిత్రాలలోని రమ్యతను సినిమాల్లోకి ఒంపి, వాటికీ ఒక ప్రత్యేకతను సంతరించారు.

బాపు-రమణలిద్దరి స్నేహం రోజు రోజుకూ ధృడపడింది. అందుకే 'సృష్టిలో తీయినిది' అంటూ 'స్నేహం' సినిమా తీశారు. రాజేంద్రప్రసాద్‌ను, సాయికుమార్‌ను ముఖ్యపాత్రలలో పరిచయం చేశారు. 'ముత్యాలముగ్గు', 'గోరంతదీపం' చిత్రాలతో తెలుగు తెరకు కొత్త సొగసులు అద్దారు. ముత్యాలముగ్గులో కాంట్రాక్టర్ భాష, వాచికం జనరంజకమయ్యాయి. రావుగోపాలరావు ఒరవడిని మార్చేశాయి. 'సీతాకల్యాణం'తో వెండితెర వ్యాసుడిగా బాపు అవతరించారు. సీతగా జయప్రదను ఆయన చూపిన తీరు అద్భుతం. అతి తక్కువ సంభాషణలు ఉన్న ఈ చిత్రం అంతర్జాతీయ చిత్రోత్సవాలన్నింటిలోనూ మన తెలుగు సినిమా ప్రాభవానికి తార్కాణంగా నిల్చింది. లండన్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో

పాఠ్యాంశంగా చిత్రాన్ని చేర్చారు. సంపూర్ణ రామాయణంలో శబరి పాట, రావణుడి పశ్చాత్తాపం, లక్ష్మణుడి నవ్వు, కైక అలక, భరతుడి ఆగ్రహం సన్నివేశాలు బాపు సృజనాత్మక చాతుర్యానికి గీటురాళ్ళు. 'భక్తకన్నప్ప' ఒక అందమైన దృశ్య కావ్యం. 'మనవూరి పాండవులు'లో చిరంజీవి ప్రతిభ తళుక్కుమంది. అతడి ఉజ్వల భవిష్యత్తుకు పచ్చజెండా వూపింది బాపూయే. ఆ చిత్రం హిందీలో 'హమ్‌పాంచ్'గా తీస్తూ మిథున్ చక్రవర్తి, అమ్రిష్‌పురిని హిందీ తెరకు పరిచయం చేశారు. తూర్పువెళ్ళే రైలు, రాధాకళ్యాణం చిత్రాలు రీమేక్‌లే అయినా బాపూ గీతలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. కలియుగ రావణాసురుడు, రాజాధిరాజు, అందాల రాముడు, మంత్రిగారి వియ్యంకుడు, శ్రీరాజరాజేశ్వరీ కాఫీ విలాస్, పెళ్ళీడు పిల్లలు, కృష్ణావతారం శుచికరమైన సినిమాలుగా నిలబడ్డాయి. మిస్టర్ పెళ్ళాం, పెళ్ళి పుస్తకం మొదలైన చిత్రాలు మన బతుకు కథలే.

శ్రీనాథకవి సార్వభౌముడు, శ్రీ రామాంజనేయయుద్ధం ఎన్‌టిఆర్‌తో బాపూ చేసిన సినిమాలు. బాపూ హిందీలోనూ ఎన్నో విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించారు. తన వద్ద సహాయ దర్శకుడిగా వున్న అనిల్ కపూర్‌ను తెలుగులో వంశవృక్షం, హిందీలో వోసాత్‌దిన్‌తోనూ పరిచయం చేశారు. బాబా ఆజ్మీని కెమెరామెన్‌గా, ఎడిటర్‌గా చంద్ర, కళా దర్శకుడిగా బిజాన్‌దాస్ గుప్తాలకు కూడా ఆయనే తొలి ఛాన్స్ ఇచ్చింది. 'అనోకా', 'హమ్‌పాంచ్' 'మొహబత్' 'ప్యారీ బెహన్', 'మేరాధరమ్' 'దిల్‌వాలా', 'ప్రేమ్‌ప్రతిజ్ఞ', 'పరమాత్మ' 'బేజుబీన్' చిత్రాలను బాపూ రూపొందించారు. హిందీ పరిశ్రమలోనూ ఆయనకు పేరు ప్రఖ్యాతులు ప్రేమాభిమానాలు వున్నాయి.

బాపూ సినిమాలంటే ప్రకృతి రమణీయతకూ, అందమైన ప్రేమ్‌లకూ మాత్రమే పరిమితం కాదు. అనేక భావ సంఘర్షణలను ఎలాంటి హడావిడి, అలజడి లేకుండా ఆయన తన కథనంతో అల్లుకుపోతారు. బుద్ధిమంతుడులో దైవభక్తి, మనిషిబలం మధ్య, ఇహం-పరం మధ్య సునిశితంగా కథ నడిపారు. ధనిక, మధ్య తరగతి వర్గ తారతమ్యాల మధ్య ప్రేమ కథాంశాన్ని 'అందాలరాముడు'లో హృద్యంగా చూపారు. రెండు లాంచీలలో నడిచిన కథను చూస్తుంటే టైటానిక్ - అందాల రాముడికి వేల్యూ ఏడెడ్ సినిమానా అనిపిస్తుంది.

ఆర్థిక పరిస్థితులు భార్యాభర్తల మధ్యకు చొచ్చుకువస్తే ఆ సంసారంలో అల్లిబిల్లిగా అల్లుకుపోయే కలహాలు, అలకలు, వేడుకలు కలగలిసిన సంచికలా 'పెళ్ళిపుస్తకం' 'మిస్టర్ పెళ్ళాం' చిత్రాలు రూపొందాయి. ముళ్ళపూడి మాటలనే కాదు, ఆరుద్ర వంటి కవుల పాటలనూ బాపూ చక్కగా మలచుకొంటారు. సమగ్రాంధ్ర సాహిత్య దీక్షలో పాటలు రాయడం ఆపిన ఆరుద్ర బాపూ కోసం దీక్ష వీడి 'పెళ్ళి పుస్తకంలో' సినిమాకు 'ఇక ఆకారం దాల్చనుంది కొత్త జీవితం' పాట రాశారు. ఆతర్వాత ప్రతి పెళ్ళి ముంగిట్లో ఈ పాట ఖచ్చితంగా వినిపిస్తోంది. నృత్య దర్శకుడి ఆలంబన తీసుకోకుండానే బాపూయే స్వయంగా ఈ పాటను చిత్రీకరించారు. ఇదివరలో సాక్షిలో 'అత్తకడుపు చల్లగా' పాటకు కూడా ఆయనే మూమెంట్స్ కంపోజ్ చేశారు. అలాగే వాంప్‌లచే నిండుగా చీర కట్టించి 'ఎంతటి రసికుడివో తెలిసెరా' (ముత్యాలముగ్గు), శివ శివ అననేలరా (భక్తకన్నప్ప) అంటూ శాస్త్రీయ నృత్యాలు చేయించిన కొంటె దర్శకుడు కూడా బాపూయే.

అందాలరాముడులో మంగళంపల్లితో 'పలుకే బంగారమాయెరా' పాడించి, ముత్యాలముగ్గులో గుంటూరు శేషేంద్రశర్మతో 'నిదురించే తోటలోకి' పాటను రాయించిన బాపూ అభిరుచి గొప్పది. కంప్యూటర్లకు, గ్రాఫిక్ డిజైనర్ల నుంచి కలం పట్టిన ప్రతి ఒక్కరికీ తన చిలిపి దస్తూరీని బాపు లిపిగా అందించారు. ఎన్నో వేల బొమ్మలను గీసిన బాపు శైలి అనన్య సామాన్యం అని ఆయన బొమ్మలు కథలు చెబుతాయి. ఆయన సినిమాలు అందమైన బొమ్మలుగా అగుపిస్తాయి. అదే ఆయన గొప్పదనం. తెలుగు పత్రికలన్నీ చాలావరకూ తమ ప్రారంభ సంచికలను, పర్వదిన సంచికలను బాపు బొమ్మలతోనే మెరిపించాయి. ఎన్.టి.ఆర్ కూడా బాపూ ఆలస్యాన్ని ఓపిగ్గా సహించి సీతారామకళ్యాణం బొమ్మ గీయించుకొని తన తారకరామ థియేటర్‌పై అలంకరించుకొన్నారు.

చక్కని చిత్రాలకూ, కళాత్మక చలన చిత్రాలకూ నూతన భాష్యం చెప్పిన వాడు బాపు. ఆయన దస్తూరీలాగే చిత్ర నిర్మాణశైలిని కూడా అనుకరించాలనే తపన ఎందరిలోనో ప్రారంభమయ్యింది.

నిజంగా యువ దర్శకతరం బాపు మార్గంలో నడిస్తే, వెలుగు రేఖల కాంతిలో మనకు ఎన్నెన్నో మంచి చిత్రాలు కళకళలాడుతూ కానవస్తాయి.

**-పి.వి.రామమోహన్‌నాయుడు**